వైద్యుల సమ్మెపై ప్రభుత్వ మొండివైఖరి

- 13వ రోజూ పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- తగ్గేది లేదంటున్న వైద్యులు
- చర్యలు తప్పవంటున్న ప్రభుత్వం



సమ్మె చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

దెందులూరు: వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న సమ్మె శుక్రవారం 13వ రోజుకు చేరింది. ప్రభుత్వం మానవతా ధృక్పథంతో వైద్యుల సేవలు పరిగణలో తీసుకుని వారి సమస్యలు పరిష్కరించాలని వైద్యులు కోరుతున్నారు. మరింత విస్తృతంగా అంకిత భావంతో వైద్య సేవలు అందించేలా సమస్యల పరిష్కారానికి అన్ని రకాలుగా ప్రభుత్వానికి వినతులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో నేరుగా వైద్యులు సమ్మెలోకి దిగారు. ప్రభుత్వానికి నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సానుకూల దృక్పథం చూపడంలేదని తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె నుంచి నిరాహార దీక్షలకు దిగామని వైద్యులు అంటున్నారు. నిరాహార దీక్షలు రోజులు పెరుగుతుండడంతో ప్రభుత్వం శుక్రవారం నోటీసు జారీ చేసింది. సమ్మె విరమించి విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవని ఏపీ వైద్యశాఖ డైరెక్టర్ లికితపూర్వక ఆదేశాలు జారీ చేశారు.

పీహెచ్‌సీల వివరాలు ఇలా..

దెందులూరు నియోజకవర్గంలో గోపన్నపాలెం, పోతునూరు, పెదవేగి, పెదపాడు, టపర్రు, గుడివాకులంకల్లో పీహెచ్‌సీలున్నాయి. 6 పీహెచ్‌ఈఎల్, 12 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులు సమ్మె చేస్తుండడంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రతి పీహెచ్‌సీకి వైద్యులను తాత్కాలికంగా కేటాయించి వైద్య సేవలు నిలుపుదల లేకుండా చర్యలు తీసుకుంది. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తగ్గేది లేదని పీహెచ్‌సీల వైద్యులు తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం నేరుగా విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవని లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చింది. భవిష్యత్ కార్యక్రమాన్ని ఏ విధంగా రూపొందిస్తారనేది శనివారం తేలనుంది.

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు

- జీవో నెంబర్ 99 నిలిపివేయాలి ఇన్ సర్వీస్ పీజీ కోట పునరుద్ధరించాలి.
- డీపీహెచ్‌లో టైం బాండ్ ప్రమోషన్లు డీఎస్‌హెచ్‌తో సమానంగా అమలు చేయాలి.
- గిరిజన భత్యం మంజూరు చేయాలి.
- ఎఫ్‌డీపీసీఎస్‌సీ భత్యం ఇవ్వాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలి.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వం పీహెచ్‌సీ డాక్టర్ల అభివృద్ధి మరింత విస్తృత సేవలు అందించేలా మానవతా ధృక్పథంతో చర్యలు తీసుకోవాలి. డిమాండ్లు పరిష్కరించాలి. సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న వైద్యుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. దీంతో మెరుగైన వైద్య సేవలకు ఆస్కారం ఉంటుంది.

– రాకేష్, వైద్యాధికారి

ఆమోదిస్తారని నమ్ముతున్నాం



ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లను ఆమోదిస్తారని నమ్ముతున్నాం. జూనియర్ డాక్టర్ల సేవలను పరిగణలో తీసుకోవాలి. జూనియర్ డాక్టర్ల డిమాండ్లు న్యాయబద్ధమైనవి. కాబట్టి ప్రభుత్వం పరిష్కరిస్తుందని నమ్మకంతో ఉన్నాం. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– పవన్, వైద్యాధికారి

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛను కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

ఉంగుటూరు: పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పోలీసులు నెల్లూరులో పత్రికా విలేకరులపై కేసులు పెట్టి భయాందోలన కలిగించడాన్ని ఖండించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని ఖండించాలని కోరారు. నెల్లూరు, హైదరాబాదు సాక్షి కార్యాలయాలపై దాడిని ఖండించారు. ప్రజా సంఘాలు ప్రతినిధులతో కలిసి తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు పీవీ పెద్దిరాజు, అధ్యక్షుడు ముప్పన భుజంగరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోర్ని అప్పారావు, ఉంగుటూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జి మర్రి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా దీపావళి ప్రమిదల కొనుగోళ్లు


దీపావళికి సిద్ధమైన ప్రమిదలు


దెందులూరు: దీపావళి ప్రమిదలు, వస్తు సామగ్రిపై తుఫాను ప్రభావం పడింది. గత రెండు నెలలుగా నాలుగు రోజులకో సారి తుఫాను వస్తూనే ఉంది. ఈ దీపావళి పండుగకైనా వర్షాలు రాకుండా ఉంటే బాగుండునని దీపావళి ప్రమిదలు, వస్తు సామగ్రి విక్రయదారులు దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. అన్ని షాపుల్లో దీపావళి సామగ్రి అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. పండుగకు కావలసిన పలు రకాల ప్రమిదలు తోపుడు బండ్లపై అమ్ముతున్నప్పటికీ కొనుగోలుపై ప్రజలు ఆసక్తి చూపటం లేదని విక్రయదారులు అంటున్నారు. టీవీలు, సెల్‌ఫోన్లు, సినిమా హాళ్ల ప్రభావం కొంత ఉండటంతో ప్రమిదలు, పండుగ సామగ్రి కొనుగోలు మందగించిందని విక్రయదారులు చెబుతున్నారు.

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలి


ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో మాత్రమే భర్తీ చేయాలని ఏపీ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ ఐక్య వేదిక (ఏపీయూఎస్‌టీఎఫ్) కోరింది. ఈ మేరకు నీలాద్రిపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు విచ్చేసిన ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఏపీ డీఎస్సీలో ఒక జిల్లాలో ఒక పోస్టుకు ఒకే పేపర్‌తో డీఎస్సీ నిర్వహించి, నార్మలైజేషన్ ప్రక్రియకు స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి సీహెచ్ ప్రియాంక, డీఎస్సీ అభ్యర్థులు సీహెచ్ మేఘావతి, డి.రేవతి, ఎస్.కొండమ్మ, డి.విజయ్, సీహెచ్ దొరబాబు, సీహెచ్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

మానవత సంస్థకు విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత కొనిశెట్టి రమేష్

గణపవరం: మానవత సంస్థ ఏర్పడిన అనతి కాలంలోనే అంతర్జాతీయ సేవా సంస్థలతో పోటీ పడుతూ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని మానవత సంస్థ రీజియన్ చైర్మన్ సంకు సత్యకుమార్ అన్నారు. ఇలాంటి సేవా సంస్థలకు దాతలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. శుక్రవారం గణపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కొనిశెట్టి రమేష్ పెన్మెత్స రవి కలిసి నిడమర్రు మండల మానవత సంస్థకు రూ.25 వేల విరాళం అందజేశారు. మానవత కార్యదర్శి అలుమోలు అంతర్వేది, కాన్వెంట్ శ్రీను, వీరాస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవడమే పరమావధి

భీమడోలు: దివ్యాంగులను ఆదుకోవడమే పరమావధిగా అఖిలాంధ్ర దివ్యాంగుల సేవా సమితి పని చేస్తుందని జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం అన్నారు. భీమడోలులో శుక్రవారం అఖిలాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. నక్కా రాము, ఎ.దుర్గాప్రసాద్, వరలక్ష్మి, సుధా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జీవన ఎరువులు తప్పక వాడాలి


రైతులకు సూచనలు అందిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్

పెదపాడు: రబీ సీజన్‌లో అపరాల్లో పెసలు సాగు చేసే ప్రతి రైతు రైజోబియం జీవన ఎరువులను తప్పక వాడాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణికుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు గ్రామంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, నీలి ఆకుపచ్చ నాచు, అజోల్లా వంటి జీవన ఎరువులను వినియోగించడం ద్వారా మొక్కలకు నత్రజని లభ్యత పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పొటాషియం మొబిలైజర్స్ మొక్కకు అందుబాటులో లేని పొటాషియాన్ని అందిస్తాయన్నారు. ఇవి ద్రవ రూపంలో ఉండే జీవన ఎరువులని 500 మిల్లీ లీటర్లను 100 లీటర్ల నీటిలో కలిపి 100 కేజీల ఆవు పేడలో కలిపి మాగిన తరువాత పొలంలో చల్లుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని రైతులకు తెలిపారు. వీటిని వినియోగించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో పెదపాడు మండల వ్యవసాయ అధికారి షేక్ ఇమామి ఖాసిమ్ ఎంపీటీసీ శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దాత లక్ష్మన్న

గణపవరం: విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్ అందుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం గణపవరం బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు, మెమోంటోలను అందజేశారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు విష్ణుబొట్ల రామన్న లక్ష్మన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నారు. శుక్రవారం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానం విద్యార్థికి రూ.40వేలు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ విద్యార్థికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోట సింహాద్రి అప్పారావు, హోతా ఆంజనేయులు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రస్తుత పరిస్థితుల్లో హృద్రోగ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, అందువలన ప్రతి ఒక్కరూ సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసాసిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం వరదరాజపురం గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా గుండె ఆగిపోయిన సందర్భంలో రక్త పంపిణీ ఆగిపోయి మెదడుకు ఆక్సిజన్ అందదని అలాంటి సమయంలో సీపీఆర్ చేయడం వలన ఆ వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. సీపీఆర్ లక్ష్యం ఊపిరితిత్తుల లోపలికి, బయటకు, ఆక్సిజన్ ప్రవహించేలా చేయడం, శరీరం గుండా ఆక్సిజన్‌తో కూడిన రక్తం ప్రవహించేలా చేయడం, కణజాల మరణాన్ని ఆలస్యం చేయడమేనని వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్ నిర్మాణ పనులు


పైప్‌లైన్ పనులు చేస్తున్న కూలీలు

నిడమర్రు: బువ్వనపల్లిలో 3 కిలో మీటర్ల మేర కొత్త పైప్‌లైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సత్యనారాయణపురం వద్ద నిర్మించిన ఆర్‌ఎస్ 34 చెరువు మంచినీటి ట్యాంక్ నుంచి సత్యనారాయణపురం శివారు వరకూ జగనన్న-వాసన్న కొత్త కాలనీ వరకూ పనులు చేపట్టారు. జగ్గయ్య చెరువు ట్యాంక్ నుంచి అడవికొలను రోడ్ శివారు వరకూ ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు తెలిపారు. జనరల్ ఫండ్‌తో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు ప్రారంభించామన్నారు. పలు చోట్ల పాత పైప్‌లైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తగా హెచ్‌డీపీ పైప్‌లైన్లు వేస్తున్నామన్నారు. దీంతో గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు గ్రామ శివారు వరకూ వెళుతుందని తెలిపారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు

ఉంగుటూరు: యర్రమళ్ల గ్రామానికి చెందిన మైనం సత్యనారాయణ ఎక్సెల్ మోటారు సైకిల్‌పై ఉంగుటూరు వస్తుండగా నాచుగుంట వద్ద జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో సత్యనారాయణకు తీవ్రగాయాలు అయ్యాయి. రక్త స్రావం అవడంతో ప్రాథమిక చికిత్స అందించిన 108 వాహన సిబ్బంది తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

పంట నమోదు తప్పనిసరి

పెదవేగి: రైతులు తప్పకుండా పంటల వివరాలను రైతుసేవా కేంద్రం సిబ్బందితో ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని పెదవేగి ఉద్యాన అధికారిణి ఎం.రత్నమాల అన్నారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించే ఇన్‌సెంటివ్స్, మద్దతు ధర, విపత్తుల సమయంలో నష్ట పరిహారం ఇవ్వటానికి ఈ పంట నమోదును ఆధారంగా తీసుకుంటారని ఆమె చెప్పారు. కావున కోకో, అరటి సాగు చేస్తున్న రైతులు, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ నెల 25 లోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని రత్నమాల కోరారు.

పెదవేగిలో నలుగురు జూదరుల అరెస్టు

పెదవేగి: మండలంలోని పెదవేగి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 34,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఎస్పీకె. ప్రతాప్ శివ కిషోర్ నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ఆదేశాల మేరకు, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్‌కు శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు పెదవేగి పోలీసులు పేకాట స్థావరంపై అకస్మాత్తుగా దాడి చేశారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.36,950 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 4 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు: చల్ల చింతలపూడి గ్రామం కొత్త కమ్మవారిగూడెంలో శ్రీవుంతలో ముసలమ్మ అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు హోమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు.

జీఎస్టీతో రైతులకు మేలు

దెందులూరు: బిందు సేద్యం పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు హెక్టార్‌కు రూ.5 వేలు ఖర్చు తగ్గుతుందని దెందులూరు మండల హార్టికల్చర్ అధికారి కిరణ్ అన్నారు. శుక్రవారం దెందులూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోకో రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు గ్రామాల్లోని హార్టికల్చర్ అసిస్టెంట్లను సాగు రైతులు సంప్రదించి ఉద్యానవన సాగు అభివృద్ధి చేసుకోవాలన్నారు.

బాణసంచా విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి


బాణసంచా దుకాణాల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: బాణసంచా విక్రయాల దుకాణదారులు అప్రమత్తతతో మెలగాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. దీపావళిని పురస్కరించుకుని భీమడోలులో అనుమతులు పొందిన తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని శుక్రవారం పలు శాఖల అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. దుకాణాల వద్ద అధికారులు సూచించిన భద్రతా ఏర్పాట్లును విధిగా పాటించాలని దుకాణదారులకు వివరించారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై వై.సుధాకర్, ఫైర్ అధికారి వి.రవి కుమార్, ఏఈ శివాజీ, ఆర్ఐ జగన్నాథం, వీఆర్వోలు వెజ్జు వినయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


భీమరాజు

దెందులూరు: అన్ని గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దెందులూరు ఎంపీడీవో ఎం.భీమరాజు అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని శాఖల మండల అధికారులు శాఖాపరమైన నివేదికను వివరించారు. ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. హౌసింగ్ డీఈ వివేకానంద, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, పశు వైద్య శాఖ అధికారి హరికృష్ణ, ఆర్‌అండ్‌బీ ఏఈ శేషు కుమార్, ఎంఈఓ ఏపీఎస్‌పీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం సురేష్, ఉపాధి ఏపీఓ ఫాతిమా, ఎంపీటీసీలు, నీటి వినియోగ సంఘ అధ్యక్షులు, వీఆర్‌వోలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం


కొత్తపల్లిలో ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రస్తుత వాతావరణ మార్పులలో జ్వరాలు, అంటు వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉందని గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా గణపవరం మండలం కొత్తపల్లిలో అంటువ్యాధులు, దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాలలో తడిలేకుండా చూడాలని, వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించాలని, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. దోమల నిర్మూలనతోనే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని, అందువలన ప్రతి ఒక్కరూ దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే


ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: దెందులూరు డీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్లు పుష్పాలు బొకేలు ఇచ్చి కళాశాలకు స్వాగతం పలికారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సుగ్గిసెట్టి నూకరాజు మాట్లాడుతూ జూనియర్లు, సీనియర్లు అనే భేదం లేకుండా క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో బయటకు వెళ్లాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల విధుల బహిష్కరణ


పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

దెందులూరు: దెందులూరు సీహెచ్‌సీలో గత నాలుగు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, 15 నెలలుగా పీఎఫ్‌లు ఇవ్వకపోవడంతో శుక్రవారం విధులను బహిష్కరించారు. సీహెచ్‌సీ బయట నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వైద్యులనూ లోపలికి వెళ్లనివ్వలేదు. 11:30 గంటల తరువాత మానవతా ధృక్పథంతో రోగులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వైద్యులను లోపలకు వెళ్లనిచ్చారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మిక నాయకుడు అనిల్ మాట్లాడుతూ ఏఐటీయూసీ అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, కార్యదర్శి దత్తాత్రేయ ఆదేశాల మేరకు తాము విధులు బహిష్కరించినట్లు తెలిపారు. తమకు జీతాలు ఇచ్చే వరకు వైద్యశాలలో విధులు నిర్వహించమన్నారు.

సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్‌పై దాడి అమానుషం


పెదవేగి: ధర్నా చేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

పెదవేగి/దెందులూరు: సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దెందులూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ యువసేన యర్ర రఘు మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెదవేగి మండల కేంద్రంలో రాస్తారోకో నిరసన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళీ కృష్ణ మాదిగ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు మద్దాల తిరుపతిరావు మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడి న్యాయవ్యవస్థపై దాడిగా భావించి, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీతో వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నకూటి జాన్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు యర్రా ఆనంద్, మద్దాల మికాయేలు, కొలికిపాము యేసు, అచ్యుత్‌పూలే, లక్కపాము శ్రీనివాసరావు, చలపాల నాగరాజు, పెనుమాక చిట్టి, కొవ్వలి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఉంగుటూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా ఎంఆర్‌పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఉంగుటూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ నాయకులు మర్రి నరేష్ మాదిగ మాట్లాడుతూ గవాయ్‌పై దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చిరంజీవి, బాలకృష్ణ, జూలపల్లి వెంకటరావు, ఆంధ్రపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉంగుటూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు


దెందులూరు: డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు